క్లుప్తంగా

సుశీలకు ఘన నివాళి



సుశీల చిత్రపటానికి నివాళులర్పించిన దృశ్యం

గుంతకల్లు: గాన కోకిల పీ.సుశీల జయంతిని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, జీఎంవీ చలపతి తదితరులు మాట్లాడారు. సుశీల దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడినట్లు తెలిపారు. జాతీయ అవార్డులు పొందారని గుర్తు చేశారు. అనంతరం ఆమె పాడిన పలు పాటలను పాడి వినిపించారు. కార్యక్రమంలో సభ్యులు బషీర్, రంగనాయకులు, ఆనంద్, శ్రీరామమూర్తి, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం 7 గంటలకు హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ సిబ్బంది విధిగా హాజరుకావాలన్నారు. హుండీ లెక్కింపునకు హాజరయ్యే భక్తుల్లో పురుషులు పంచ, కండువా ధరించి రావాలన్నారు. అదేవిధంగా బంగారు, వెండి ఆభరణాలు, మొబైల్ ఫోన్స్ వంటివి వెంట తెచ్చుకోకూడదని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

శింగనమల: మండల పరిధిలోని ఈస్ట్ నరసాపురం ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థినులు అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీతకుమారి తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి జూడో పోటీల్లో ఎంజేపీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కీర్తన ప్రథమ స్థానం, భవ్యశ్రీ ద్వితీయ స్థానం దక్కించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను సోమవారం ఉపాధ్యాయులు, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, కోచ్‌లు, సిబ్బంది అభినందించారు.

16న వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

పెద్దపప్పూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16న ఉదయం 11 గంటలకు వైస్ ఎంపీపీ-2 ఎన్నిక నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రభాకర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలందరూ తప్పక హాజరు కావాలని కోరారు.


'పల్లె వెలుగు'కు తప్పిన పెను ముప్పు



యాక్సిల్ విరిగి బయటకు వచ్చిన టైర్లు

యాడికి: డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో తాడిపత్రి నుంచి గుత్తి వైపు వెళుతున్న పల్లె వెలుగు బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం మధ్యాహ్నం తాడిపత్రి డిపో నుంచి బయలుదేరిన ఏపీ 02 టీఈ 3789 నంబరు గల బస్సు యాడికిలోని వినాయక గుడి వద్దకు చేరుకోగానే యాక్సెల్ విరిగింది. దీంతో బస్సు వెనుక రెండు టైర్లు ఊడి బయటకు రాసాగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సును ఆపేయడంతో బయట పడుతున్న టైర్ల మీదనే బస్సు ఆగింది. దీంతో బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రయాణికులను మరో బస్సులో గమ్యస్థానాలకు కండక్టర్, డ్రైవర్ పంపించారు.

నేటి నుంచి పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పాతబస్టాండ్‌లో పునఃనిర్మించిన పోలేరమ్మ ఆలయంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకూ కలశస్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకుడు మేస్త్రీ దొడ్డప్ప సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 14న గ్రామోత్సవం, గణపతిపూజ, 15న కలశ ఆవాహన, గోపూజ, హోమాలు, 16న అమ్మవారి యంత్రప్రతిష్ఠ తదితర చేపడుతారు. మూలవిగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, తదితర హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామని తెలిపారు.

కార్తీకం.. శుభప్రదం

- నేటి నుంచి కార్తీక మాసోత్సవాలు
- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు

తాడిపత్రి అర్బన్: ప్రాచీన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసోత్సవాలకు సిద్ధమైంది. ఏటా ఇక్కడి శివాలయంలో కార్తీక ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్తీక మాసంలో వచ్చే నాలుగు సోమవారాల పాటు ప్రత్యేక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇప్పటికే ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయడమే కాకుండా చలువ పందిళ్లను సిద్ధం చేశారు. బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే శివమాలధారులు, అయ్యప్ప మాలధారులు, చిన్నపిల్లల తల్లులు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. మహిళా భక్తుల కోసం స్నానపు గదులు, టాయిలెట్స్ నిర్మించారు. ఆలయం ప్రాంగణం వెలుపల శివమాలాధారులు, అయ్యప్ప దీక్షాపరుల స్నానాల కోసం ప్రత్యేకంగా షవర్లు, కుళాయిలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు సూచించారు. 20న సోమవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి రానుండడంతో అన్ని వసతులు కల్పించారు.

పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

భక్తుల వాహనాల పార్కింగ్‌కు పెన్నానదిలోని రజకాభివృద్ధి సంస్థ ఫంక్షన్ హాలు ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. గతంలో నేరుగా శివాలయం వద్దకు వాహనాలు వస్తుండటంతో భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. అంతేకాకుండా రద్దీ కూడా అధికంగా ఉండటంతో అసౌకర్యానికి గురయ్యేవారు. దీంతో పోలీసులు పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు.



విశేష అలంకరణలో పార్వతీదేవి



అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు

డిసెంబర్ 12 వరకూ ఉత్సవాలు

మంగళవారం నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకూ కార్తీక ఉత్సవాలను నిర్వహించనున్నారు. 20వ తేదీ కార్తీక మాసం మొదటి సోమవారం రోజు సహస్ర లింగార్చన, 26న ఆదివారం జ్వాలా తోరణం, 27న రెండవ సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆకాశ దీపోత్సవం, గంగా దీపం, 30న ఆరుద్ర నక్షత్రంలో లక్ష బిల్వార్చన, డిసెంబర్ 4న కార్తీక నోములు, 11న మాస శివ రాత్రి సందర్భంగా సాయంత్రం 6:30 నిమిషాలకు కార్తీక దీపోత్సవం, 12న కాశీ విశ్వేశ్వరుడికి భస్మాభిషేకం నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆధ్వర్యంలో మాసోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.



తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువపందిళ్లు, క్యూలైన్లు

బుగ్గ సంగమేశ్వరాలయంలో..

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ శైవక్షేత్రం బుగ్గ సంగమేశ్వర ఆలయంలో ప్రతి ఏడాది నెల రోజుల పాటు అత్యంత వైభవంగా సాగే కార్తీక మాస ఉత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలు జరుగనున్న నాలుగు సోమవారాల పాటు భక్తులు ఆలయానికి భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపట్టినట్లు ఆలయ ఈఓ క్రిష్టయ్య తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన మొదటి సోమవారం, ఈనెల 27వ తేదీన రెండవ సోమవారం, అదే విధంగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తారు. డిసెంబర్ 4వ తేదీన మూడవ సోమవారం, డిసెంబర్ 11వ తేదీన 5 సోమవారం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో నిత్యాన్నదానం, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సంతాన సంగమేశ్వరుడిగా, కళ్యాణ సంగమేశ్వరుడిగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర స్వామిని దర్శించుకుని, దీపారాధన చేయాలని భక్తులకు సూచించారు.



ముస్తాబైన బుగ్గ సంగమేశ్వర ఆలయం

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటన

యాడికి: మండలంలోని వేములపాడు పంచాయతీలోని కొట్టాలపల్లె, తిమ్మాపురం, వేములపాడు, రాయలచెరువు పంచాయతీలోని రాయల చెరువు, కుర్మాజీపేట, రామరాజుపల్లె గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు.

పరామర్శ

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రేకులకుంటకు చెందిన మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు సాకే లక్ష్మీ నారాయణ చిన్నాన్న సాకే నల్లప్ప సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరి రమణారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాకే రామకృష్ణ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సాకే నల్లప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాకే నారాయణ స్వామి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, రంగనాథ్, మాజీ ఎంపీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కనంపల్లిలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గార్లదిన్నె: మండల పరిధిలోని కనంపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనంపల్లిలో ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం తిమ్మంపేట, పాపినేపాళ్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనాలని కోరారు.

విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి

గార్లదిన్నె: మండల పరిధిలోని కెకె తండాకు చెందిన వెంకటనాయక్ అనే రైతుకు చెందిన పాడి గేదె ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. వెంకటనాయక్ పాడి గేదెలను మేత కోసం వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మేత మేస్తున్న గేదె ప్రమాదవశాత్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతంతో మృతి చెందింది. వెంటనే పశు వైద్యాధికారి ఆంజనేయులకు సమాచారం అందించారు. పశు వైద్యాధికారి సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన గేదెను పరిశీలించారు. అనంతరం అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గుంతకల్లు: గ్రంథాలయాలు విజ్ఞాన బండారాలు అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ గ్రంథాలయాల వారోత్సవాల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి కమ్మన మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 14న నెహ్రూ జయంతిని జరుపుకుంటామన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, 18న వివిధ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జన్మదినం సందర్భంగా దిశా చట్టం, మహిళా సాధికారతపై సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇక 20న ముగింపు సందర్భంగా వివిధ రకాలైన పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ గ్రంథాలయాధికారి ఎం.హేమలత, రికార్డు అసిస్టెంట్ సి.రాము పాల్గొన్నారు.



గుంతకల్లులో పోస్టర్లను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె/పామిడి: బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, పామిడి మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల్లో 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు పున్నం విజయ భాస్కర్, శిరీష, సీ వెంకటలక్ష్మమ్మ సోమవారం వేర్వేరుగా తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొనాలని సూచించారు.

నేడు సచివాలయాల్లో వై ఏపీ నీడ్స్ జగన్

శింగనమల: శింగనమల మండలంలోని సీ.బండమీదపల్లి సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి పాల్గొంటారన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి వద్ద మంగళవారం సాయంత్రం 4 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ అంకే నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

యల్లనూరు: మండలంలోని చింతకాయమంద సచివాలయం-1లో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 15న చింతకాయమంద-2, 16న చిలమకూరు, 17న దంతలపల్లి, 20న కల్లూరు, 21న కూచివారిపల్లి, 22న మల్లాగుండ్ల, 23న శింగవరం గ్రామాల్లోని సచివాలయాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయి స్వామి తెలిపారు. వలంటీర్లు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

ధర్మప్రచార వారోత్సవాలకు ఆహ్వానం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుంచి ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం పాలకమండలి సభ్యులతో కలిసి ఎమ్మెల్యే వైవీఆర్‌ను ఆలయ ఈఓ గురుప్రసాద్ కలిశారు. ధర్మప్రచార వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలంటూ ఆహ్వానించారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకూ ధర్మప్రచార వారోత్సవాలు జరుగుతాయన్నారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వారోత్సవాలను ప్రారంభించాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు.



ఎమ్మెల్యే వైవీఆర్‌ను ఆహ్వానిస్తున్న పాలకమండలి సభ్యులు

అదే విధంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతి రెడ్డిని ధర్మప్రచార వారోత్సవాలకు ఆహ్వానించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పామిడి: ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స అనంతరం గుంతకల్లులో విశ్రాంతి తీసుకుంటున్న పామిడి మండల వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ కే.నారాయణరెడ్డిని ఆదివారం ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వీరాంజనేయులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇటీవలే మృతి చెందిన రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ త్యాగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, రమణారెడ్డి, పసుల నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, దాసరి కృష్ణ, నాగేశ్వరరావు, జయరాం, నల్లప్ప, రమేష్‌రెడ్డి, మోహన్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.



కన్వీనర్ నారాయణరెడ్డితో మాట్లాడుతున్న ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వీరాంజనేయులు

పూర్వ విద్యార్థుల సందడి



సమావేశమైన పూర్వ విద్యార్థులు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999-2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 23 సంవత్సరాల అనంతరం విద్యార్థులంతా ఒకచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ఒకరికొకరు అప్యాయంగా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి దేవరాజు మృతి చెందడంతో ఆయన భార్యకు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం పూర్వ గురువులను చంద్రశేఖర్ గౌడ్, నారాయణరెడ్డి, కల్పలత, పీడీ నాగరాజును పూలమాలలతో సన్మానించి మోమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సుదర్శన్ నాయుడు, వెంకటరామిరెడ్డి, గంగన్న, ఓబిలేసు, నాగన్న, సుదర్శన్ రెడ్డి, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో చోరీ

పెద్దపప్పూరు: మండలంలోని అమ్మలదిన్నె-కొండాపురం మార్గమధ్యంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు హుండీని పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి పెద్దన్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ శరత్ చంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆలయంలో సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

నగదు చోరీ

పుట్లూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సోమవారం ఓ ఇంట్లో రూ.30 వేల నగదు చోరీకి గురైంది. బాలమ్మ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ధర్మవరంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం తిరిగి గ్రామానికి రాగా ఇంటికి వేసిన తాళం పగులగొట్టినట్లు గుర్తించింది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రూ.30 వేల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ దిలీప్‌కుమార్ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు.

ఘనంగా ధనలక్ష్మి పూజ

గుంతకల్లు రూరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ధనలక్ష్మి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖమండపంలో ధనలక్ష్మి అమ్మవారిని కొలువుదీర్చారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.72,570 నగదు, 5 ద్విచక్ర వాహనాల స్వాధీనం

యాడికి: మండల కేంద్రంలో కోనుప్పలపాడు రహదారిలోని పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.72,570 నగదు, 7 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



అమీర్ సొహైల్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: స్థానిక రైల్వే గ్రౌండ్‌లో క్రికెట్ కోచ్‌గా పనిచేస్తున్న అమీర్ సొహైల్ (25) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్నూలు జిల్లా పత్తికొండ మండలం దుద్దేకొండకు చెందిన ముజఫర్ రహమాన్ కుమారుడు అమీర్ సొహైల్ దోనిముక్కల రోడ్డులో ఓ గదిని అద్దెకు తీసుకొని, గుంతకల్లు రైల్వే గ్రౌండ్‌లో క్రికెట్ కోచ్‌గా పనిచేస్తున్నాడు. సొహైల్ బంధువులు కూడా గుంతకల్లులోని కథల వీధిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం సొహైల్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వక పోవడంతో స్నేహితులు అభిషేక్, సాయి ప్రదీప్ సోమవారం రాత్రి అతని గది వద్దకెళ్లి చూశారు. మెడలో తాడుతో కింద అపస్మారక స్థితిలో పడిఉన్న అమీర్ సొహైల్‌ను చూసి వెంటనే అతడి తండ్రికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కథల వీధిలోని బంధువులు వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో సొహైల్ రువుకు తాడు తెగినట్లుగా నిర్ధారించుకుని ఆగమేఘాలపై ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సొహైల్ మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



యాడికి కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి టపాసులు కాలుస్తున్న ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి



గుంతకల్లులో అనాథ పిల్లలకు స్వీట్లు, టపాసులు అందజేస్తున్న దృశ్యం

దీపావళి సంబరాలు

యాడికి/గుంతకల్లు రూరల్/గుత్తి/యల్లనూరు/గార్లదిన్నె/పెద్దవడుగూరు/పామిడి/తాడిపత్రి టౌన్: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఆదివారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా బాణాసంచా కాల్చి సందడి చేశారు. గృహాల ముందు దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. యాడికి మండలంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులతో కలసి ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి, పోలీసులు దీపావళి జరుపుకున్నారు. విద్యార్థినులకు టపాసులు అందజేసి, సంబరాలు చేసుకున్నారు. గుంతకల్లు పట్టణంలోని అమృత వర్షిణి ఆశ్రమంలోని అనాథ పిల్లలకు స్వీట్లు, పండ్లు, టపాసులను పోలీసులు పంపిణీ చేశారు. రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి, కసాపురం ఎస్ఐ గోపాలుడు, రూరల్ ఎస్ఐ సురేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు. గుత్తిలోని కొత్తూరు అనాథ ఆశ్రమ చిన్నారులతో కలసి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీ రసూల్ దీపావళి జరుపుకున్నారు. పిల్లలతో కలసి కేక్ కట్ చేసి, స్వీట్లు అందజేశారు. అనంతరం వారికి భోజన వసతి కల్పించారు.



గుత్తి: అనాథ పిల్లలకు భోజనం వడ్డిస్తున్న పోలీసులు

కార్యక్రమంలో ఏఎస్ఐలు రామచంద్రారెడ్డి, ఆజాద్, హెడ్ కానిస్టేబుళ్లు నాగేంద్ర (ఎస్‌బి), జాఫర్, ప్రకాశం, హనుమంతు పాల్గొన్నారు. పామిడిలోని మహాయోగ దత్తపీఠం, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడిపత్రి మండలం ఆవులతిప్పాయిపల్లెలోని జీవనాలయంలో డీఎస్పీ సీఎం గంగయ్య ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు జరుపుకున్నారు. సీఐలు లక్ష్మీకాంత్‌రెడ్డి, హమీద్‌ఖాన్, ఎస్ఐలు ధరణీబాబు తదితరులు మానసిక దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవనాలయ నిర్వాహకురాలు సిస్టర్ మెలిందా పాల్గొన్నారు.




పామిడి: మహాయోగ దత్తపీఠంలో పూజలు



తాడిపత్రిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ గంగయ్య

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



గుత్తి: గుత్తి జీఆర్‌పీ పరిధిలోని లచ్చానపల్లి-ఓబుళాపురం గ్రామాల మధ్య సోమవారం రాత్రి ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప, హెడ్ కానిస్టేబుల్ వాసు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు సచివాలయ ప్రారంభోత్సవం

పుట్లూరు: మండలంలోని కడవకల్లులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం ప్రారంభిస్తారని ఎంపీడీఓ యోగానందరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

తాడిపత్రి అర్బన్: సబ్ డివిజన్ వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని డీఎస్పీ గంగయ్య సూచించారు. సోమవారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు సబ్‌డివిజన్ స్థాయి నేర సమీక్ష నిర్వహించారు. విచారణలో ఉన్న కేసులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చీటింగ్ కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. సీఐలు హమీద్‌ఖాన్, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.